సెమీస్‌కు తెలంగాణ

ఉత్సాహంగా సెపక్‌తక్రా పోటీలు

హనుమకొండ చౌరస్తా, జనవరి 12: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 34వ సీనియర్ నేషనల్ సెపక్‌తక్రా జాతీయ స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన ఉమెన్ రెగ్యు ఈవెంట్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారు. కేరళ, ఢిల్లీ, గుజరాత్, జార్ఖండ్‌పై 0-2తో గెలుపొంది సెమీస్‌కు దూసుకెళ్లారు. మెన్ రెగ్యు ఈవెంట్‌లో హిమాచల్ ప్రదేశ్, గోవా, ఒడిశా, కర్నాటకపై గెలిచిన తెలంగాణ.. ఢిల్లీ చేతిలో ఓటమిపాలైంది

బీసీసీఐ కార్యదర్శిగా సైకియా

కోశాధికారిగా ప్రభ్‌తేజ్ ● జగన్‌మోహన్ రావు శుభాకాంక్షలు

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శిగా దేవ్‌జిత్ సైకియా, కోశాధికారిగా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో సెక్రటరీ పదవిని జై షా నిర్వహించగా అతడు ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికవడంతో బీసీసీఐ కార్యదర్శిగా వైదొలిగాడు. కొద్దిరోజులుగా జై షా స్థానంలో తాత్కాలిక కార్యదర్శిగా పనిచేస్తున్న సైకియా.. ఆదివారం నుంచి పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టాడు. ఈ మేరకు ముంబైలో జరిగిన బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యులు సైకియా, ప్రభ్‌జీత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సైకియా, ప్రభ్‌తేజ్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. హెచ్‌సీఏ ప్రతినిధిగా హాజరై వీరి అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ఆయన.. ఎన్నిక తర్వాత ప్రత్యేకంగా వారిని కలిసి తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఇరా రికార్డు త్రిశతకం

బెంగళూరు: వన్డేలలో ఒక జట్టు అంతా కలిసి 300 పరుగుల స్కోరు చేయడానికి ఎంతో శ్రమించాలి. కానీ ముంబైకి చెందిన 14 ఏండ్ల యువ క్రికెటర్ ఇరా జాదవ్ మాత్రం.. ఒక్కతే 346 పరుగులు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. వన్డేలలో ట్రిపుల్ సెంచరీ సాధించిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డులకెక్కింది. మహిళల అండర్-19 ట్రోఫీలో భాగంగా ఆలూరు (బెంగళూరు)లో జరుగుతున్న ఈ టోర్నీలో మహారాష్ట్ర తరపున ఆడుతున్న ఇరా.. మేఘాలయాతో జరిగిన మ్యాచ్‌లో 157 బంతుల్లోనే 42 బౌండరీలు, 16 సిక్సర్లతో 346 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. వన్డేలలో భారత్ తరపున ఇదే అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు. అంతర్జాతీయ స్థాయిలో చూస్తే సౌతాఫ్రికా బ్యాటర్ లిజెల్లె లీ (427- 2010లో సౌతాఫ్రికా దేశవాళీ అండర్-19 టోర్నీలో) అగ్రస్థానంలో ఉండగా రెండో స్థానంలో ఇరా నిలిచింది. భారత్ నుంచి అండర్-19 వన్డే టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్లలో ప్రస్తుత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (224) ఉంది. ఇరా విధ్వంసకర త్రిశతకంతో మంధాన రికార్డు కనుమరుగైంది.

టీవోఏలో ముదిరిన వర్గపోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీవోఏ)లో వర్గపోరు మరింత ముదిరింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వర్సెస్ టీవోఏ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి వర్గాలుగా సాగుతున్న పోరులో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఆదివారం మహేశ్ గౌడ్ వర్గం.. 2025-29 కాలానికి గాను కొత్త ఆఫీస్ బేరర్ల ఎన్నికలను నిర్వహించింది. భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) నుంచి అబ్జర్వర్లు లేకుండానే ఈ ఎన్నిక జరుగడం గమనార్హం. ఈ ఎన్నికలలో అధ్యక్షుడిగా ప్రేమ్ రాజ్, ఉపాధ్యక్షుడిగా కొమురయ్య ఎన్నికయ్యారు. గత నెలలో ఎన్నికైన టీవోఏ కార్యవర్గానికి ఐవోఏ గుర్తింపు దక్కకపోగా తాజాగా టీపీసీసీ చీఫ్ వర్గం ఎన్నికలను నిర్వహించుకోవడం చర్చనీయాంశమైంది.

జట్టు ఎంపిక ఆలస్యం

ముంబై: త్వరలో జరగాల్సి ఉన్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు ఎంపిక మరింత ఆలస్యం కానుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం జనవరి 12 నాటికే ప్రాథమిక జట్టును ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. బీసీసీఐ మాత్రం మరింత సమయం కావాలని ఐసీసీని కోరినట్టు తెలుస్తోంది. ఈనెల 18 లేదా 19న భారత జట్టును ప్రకటించే అవకాశముంది.

మార్చి 21న ఐపీఎల్ ప్రారంభం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ మార్చి 21న మొదలవనుంది. మార్చి 21 నుంచి మే 25 దాకా ఈ మెగాలీగ్‌ను నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ఈ మేరకు గతంలో ప్రకటించిన తేదీ(మార్చి 14) లో స్వల్ప మార్పులు చేసింది. ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌తో పాటు ఫైనల్‌నూ కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్ వేదికగా నిర్వహించనున్నట్టు సమాచారం. త్వరలోనే అధికారిక షెడ్యూల్ వెలువడనుంది. ఇక మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్).. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 2 దాకా జరుగనుంది.

భారత్ రికార్డు విజయం

116 పరుగుల తేడాతో గెలుపు

● జెమీమా సూపర్ సెంచరీ ● మంధాన, హర్లీన్, ప్రతీక అర్ధ శతకాలు ● సిరీస్‌లో 2-0 ఆధిక్యం

జెమీమా (102)

రాజ్‌కోట్: స్వదేశంలో ఐర్లాండ్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో మరో మ్యాచ్ మిగిలుండగానే భారత మహిళల జట్టు 2-0తో సిరీస్‌ను దక్కించుకుంది. ఆదివారం రాజ్‌కోట్‌లో జరిగిన రెండో వన్డేలో టీమ్‌ఇండియా.. 116 పరుగుల భారీ తేడాతో పర్యాటక జట్టును చిత్తు చేసింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్.. రికార్డు స్థాయిలో 50 ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి 370 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (91 బంతుల్లో 102, 12 ఫోర్లు) కెరీర్‌లో తొలి శతకంతో విజృంభించగా సారథి స్మృతి మంధాన (54 బంతుల్లో 73, 10 ఫోర్లు, 2 సిక్సర్లు), హర్లీన్ డియోల్ (84 బంతుల్లో 89, 12 ఫోర్లు), ప్రతీక రావల్ (61 బంతుల్లో 67, 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో చెలరేగడంతో టీమ్‌ఇండియా రికార్డు స్కోరు చేసింది. ఛేదనలో ఐర్లాండ్.. 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసింది. కెప్టెన్ (113 బంతుల్లో 80, 10 ఫోర్లు) మినహా మిగిలిన వారు విఫలమయ్యారు. భారత బౌలర్లలో వందో వన్డే ఆడిన దీప్తి శర్మ (3/37) మూడు వికెట్లు తీయగా ప్రియా మిశ్రా (2/53) రెండు వికెట్లు పడగొట్టింది. జెమీమాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. సిరీస్‌లో మూడో వన్డే ఇదే వేదికపై బుధవారం జరుగనుంది.

1

వన్డేలలో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. గత నెలలో వెస్టిండీస్‌పై చేసిన 358 పరుగుల రికార్డు కనుమరుగైంది.

ఓపెనర్ల శుభారంభం

సూపర్ ఫామ్‌లో ఉన్న మంధానతో పాటు ఇటీవలే జట్టులోకి వచ్చిన ప్రతీక.. మరోసారి జట్టుకు శుభారంభాన్ని అందించారు. ఆది నుంచే దూకుడుగా ఆడిన ఈ జోడీ తొలి వికెట్‌కు 18 ఓవర్లలో 156 పరుగులు జోడించింది. మంధాన తనదైన శైలిలో విజృంభించి 35 బంతుల్లోనే అర్ధ శతకాన్ని పూర్తిచేసింది. ఆమెకు ప్రతీక కూడా జతకలవడంతో భారత స్కోరు వేగం రాకెట్ వేగాన్ని తలపించింది.16వ ఓవర్లో భారీ సిక్సర్‌తో ప్రతీక కూడా ఫిఫ్టీ మార్కును అందుకుంది. ఆడిన 5 ఇన్నింగ్స్‌లలో ఆమెకు ఇది మూడో అర్ధ శతకం. అయితే రెండు బంతుల వ్యవధిలో ఈ ఇద్దరూ ఔట్ అయ్యారు.

జెమీమా, హర్లీన్ నిలకడ

ఓపెనర్ల నిష్క్రమణ తర్వాత క్రీజులోకి వచ్చిన హర్లీన్, జెమీమా ఆరంభంలో ఆచితూచి ఆడారు. క్రీజులో కుదురుకున్నాక ఈ జోడీ జూలు విదిల్చింది. జార్జియానా 34వ ఓవర్లో హర్లీన్ 3 బౌండరీలు బాదింది. 58 బంతుల్లో ఆమె ఫిఫ్టీ పూర్తయింది. 62 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన జెమీమా.. బౌండరీలతో శతకానికి దగ్గరైంది. 48వ ఓవర్లో హర్లీన్ నిష్క్రమించడంతో 183 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆఖరి ఓవర్లో రెండో బంతిని బౌండరీకి తరలించిన జెమీమా.. శతకాన్ని పూర్తిచేసిన వెంటనే బ్యాట్‌ను గిటారుగా మార్చి సెలబ్రేట్ చేసుకుంది.

కౌల్టర్ మినహా..

రికార్డు ఛేదనలో ఐర్లాండ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. 8వ ఓవర్లో కెప్టెన్ గాబీ లూయిస్ (12) వికెట్ కోల్పోయిన ఐర్లాండ్.. నెమ్మదిగా ఆడింది. భారత బౌలర్లు వికెట్లు తీయకున్నా కట్టుదిట్టంగా బంతులేయడంతో ఆ జట్టుకు పరుగుల రాక కష్టమైంది. రెండో వికెట్‌కు కౌల్టర్, సారా ఫోర్బ్స్ (38) కలిసి 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కౌల్టర్.. లారా డెలాని (37)తో కలిసి 4వ వికెట్‌కు 83 పరుగులు జోడించింది. శతకం దిశగా సాగుతున్న కౌల్టర్‌ను టిటాస్ సధు బౌల్డ్ చేసింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా బ్యాట్ ఝుళిపించకపోవడంతో ఐర్లాండ్ భారీ ఓటమిని మూటగట్టుకుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 370/5 (జెమీమా 102, హర్లీన్ 89, ప్రెండర్గస్ట్ 2/75, కెల్లి 2/82); **ఐర్లాండ్:** 50 ఓవర్లలో 254/7 (కౌల్టర్ 80, సారా 38, దీప్తి 3/37, ప్రియా 2/53)

సబలెంక, జ్వెరెవ్ శుభారంభం

- జెంగ్, రూడ్ ముందంజ
- తొలి రౌండ్‌లోనే నాగల్ నిష్క్రమణ

మెల్‌బోర్న్: సీజన్ ఆరంభ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో తొలి రోజు స్టార్ ప్లేయర్లు మొదటి రౌండ్ విఘ్నాన్ని విజయవంతంగా దాటారు. మహిళల సింగిల్స్‌లో గత సీజన్ ఫైనలిస్టులు అరీనా సబలెంక, కిన్వెన్ జెంగ్ శుభారంభం చేశారు. మెల్‌బోర్న్‌లోని రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో ఒకటో సీడ్ సబలెంక.. 6-3, 6-2తో స్లోన్ స్టీఫెన్స్ (యూఎస్)ను వరుస సెట్లలో చిత్తు చేసింది. 2017లో యూఎస్ టైటిల్ నెగ్గిన స్టీఫెన్స్.. పెద్దగా పోరాడకుండానే చేతులెత్తేసింది. మరో పోరులో చైనా అమ్మాయి, ఐదో సీడ్ జెంగ్.. 7-6 (7/3), 6-1తో అన్‌సీడెడ్ టొడొని (రొమానియా)ను ఓడించి రెండో రౌండ్‌కు ప్రవేశించింది. మరో యువ సంచలనం మిర్రా ఆండ్రీవా.. 6-3, 6-3తో మేరీ బోజ్‌కొవను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో స్టార్ ప్లేయర్లు అలెగ్జాండర్ జ్వెరెవ్, కాస్పర్ రూడ్, నిషికొరి రెండో రౌండ్‌కు చేరారు. పలువురు ఆటగాళ్లు విజయం కోసం ఐదు సెట్ల పాటు శ్రమించక తప్పలేదు. రెండో సీడ్ జ్వెరెవ్.. 6-4, 6-4, 6-4తో లుకాస్ (ఫ్రాన్స్)ను వరుస సెట్లలో ఓడించాడు. ఆరో సీడ్ రూడ్ (నార్వే).. 6-3, 1-6, 7-5, 2-6, 6-1తో జామ్ మునార్ (స్పెయిన్)తో పోరాడి గెలిచాడు. నాలుగేండ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్ ఆడుతున్న జపాన్ ఆటగాడు నిషికొరి.. 4-6, 6-7 (4/7), 7-5, 6-2, 6-3తో తియగొ మొంటిరియొ (బ్రెజిల్)ను ఇంటికి పంపాడు.

నాగల్ నిష్క్రమణ

గతేడాది ఆస్ట్రేలియా ఓపెన్‌లో సత్తా చాటిన భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నాగల్ ఈసారి తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టాడు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నాగల్.. 3-6, 1-6, 5-7తో థామస్ మెఖాక్ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

భారత ఖోఖో జట్టు కోచ్‌గా నరేశ్

కొత్తపల్లి, జనవరి 12: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన జాతీయ ఖోఖో క్రీడాకారుడు, దక్షిణ మధ్య రైల్వే కోచ్ ఇస్లావత్ నరేశ్ భారత మహిళల ఖోఖో జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యాడు. సోమవారం (జనవరి 13) నుంచి ఢిల్లీలో జరుగబోయే మొదటి ఖోఖో ప్రపంచకప్ పోటీలలో పాల్గొనబోయే భారత మహిళల జట్టుకు అతడు కోచ్‌గా విధులు నిర్వర్తించనున్నాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన నరేశ్.. జాతీయ జట్టుకు కోచ్‌గా ఎంపికవడంతో ఆయనను రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

రాజడి

ఎఫ్‌డీలపై 8.55% వడ్డీ

సీనియర్ సిటిజన్లకు ఏడాది కాలపరిమితి కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు అత్యధిక వడ్డీరేట్లనిస్తున్నాయి. మొదట్నుంచీ మదుపరులకు సురక్షిత పెట్టుబడి సాధనంగా ఎఫ్‌డీలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకు ఇవిప్పుడు చక్కని లాభసాటి మార్గంగా నిలుస్తున్నాయి. పైగా సెక్షన్ 80టీటీబీ కింద ఏ బ్యాంక్ డిపాజిట్ల ద్వారా పొందిన వడ్డీ ఆదాయంపైనైనా గరిష్ఠంగా పన్ను మినహాయింపును పొందే అవకాశం సీనియర్ డిపాజిటర్లకున్నది. ఏటా రూ.50వేలదాకా లబ్ధి పొందవచ్చు. ఇక కొన్ని బ్యాంకులు మెచ్యూరిటీ కంటే ముందే డిపాజిట్లను ఉపసంహరించుకున్నా ఎలాంటి జరిమానాలు వేయడం లేదు. రూ.5 లక్షల వరకుండే డిపాజిట్లకు బీమా సదుపాయం కూడా ఉంటుందన్న విషయం తెలిసిందే. డిపాజిట్ చేసిన బ్యాంకులు దివాలా తీస్తే ఈ ప్రయోజనం వర్తిస్తుంది.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో..

బ్యాంక్	వడ్డీరేటు(%)
ఇండియన్ ఓవర్‌సీస్	7.60
బ్యాంక్ ఆఫ్ బరోడా	7.35
కెనరా	7.35
సెంట్రల్ బ్యాంక్	7.35
బ్యాంక్ ఆఫ్ ఇండియా	7.30
పీఎన్‌బీ	7.30
ఎస్బీఐ	7.30
యూనియన్ బ్యాంక్	7.30
ఇండియన్ బ్యాంక్	6.60

ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో..

బంధన్	8.55
ఇండస్‌ఇండ్	8.25
ఆర్బీఎల్	8.00
యెస్	7.75
డీసీబీ	7.60
కొటక్ మహీంద్రా	7.60
డీబీఎస్	7.50
ఫెడరల్	7.50
కరూర్ వైశ్యా	7.40
సిటీ యూనియన్	7.25
యాక్సిస్	7.20
ఐసీఐసీఐ	7.20
సౌత్ ఇండియన్	7.20
హెచ్‌డీఎఫ్‌సీ	7.10
ఐడీఎఫ్‌సీ ఫస్ట్	7.00

ట్యాక్స్‌పేయర్స్‌కు రిబేటు కిక్కు

ఐటీఆర్-2, 3 ఫారాల్లో క్లెయిమ్‌కు అవకాశం

గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను సెక్షన్ 87ఏ రిబేటు కోసం అర్హులైన పన్ను చెల్లింపుదారులకు శుభవార్త. అప్‌డేట్ చేసిన ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్) ఫారాలు.. ఐటీఆర్-2, ఐటీఆర్-3ల్లో ఆ రిబేటును క్లెయిమ్ చేసుకునేందుకు వారికి ఆదాయ పన్ను శాఖ అనుమతిచ్చింది. సెక్షన్ 87ఏ రిబేటును క్లెయిమ్ చేసుకునేందుకున్న గడువును పొడిగించి సవరించిన లేదా ఆలస్యంగా ఐటీఆర్‌లను దాఖలుచేసేవారికి ప్రయోజనం చేకూర్చాలన్న బాంబే హైకోర్టు ఆదేశాల మేరకే ఐటీ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నదని చెప్తున్నారు.

ఏమిటీ 87ఏ కింద రిబేటు?

సెక్షన్ 87ఏ కింద వచ్చే రిబేటు.. పన్ను చెల్లింపుదారులకు ఐటీ భారాన్ని తగ్గిస్తుంది. పాత పన్ను విధానంలో మొత్తం వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపున్నా, కొత్త పన్ను విధానంలో రూ.7 లక్షలలోపున్నా ఈ రిబేటును క్లెయిమ్ చేసుకోవచ్చు. దీనివల్ల ఆదాయ పన్ను 'నిల్'కు మారుతుంది. అయితే గత ఏడాది జూలై 5 నుంచి రకరకాల ఆదాయాలకు సంబంధించి ఈ రిబేటు విషయంలో సాంకేతిక సమస్యల్ని ట్యాక్స్‌పేయర్స్ ఎదుర్కొంటున్నారు. ఐటీ శాఖ నిర్ణయంతో అందులో కొంత స్పష్టత వచ్చినట్టైంది.

ఆరోగ్య బీమా క్లెయిములు

కొత్త మార్గదర్శకాలు తెలుసా..!

ఐఆర్‌డీఏఐ నిబంధనలు ఏం చెప్తున్నాయ్?

ప్రదీప్ ఓ ప్రైవేట్ ఉద్యోగి. ముందు చూపుతో తెలివిగా ఆలోచించి కుటుంబం మొత్తానికీ రూ. 15 లక్షలతో ఓ ఆరోగ్య బీమాను తీసుకున్నాడు.

రెండేండ్లుగా ఏటా ప్రీమియంలనూ చెల్లిస్తున్నాడు. ఇంతలో తన కుమారుడికి అనారోగ్య సమస్య వచ్చింది. వెంటనే హెల్త్ ఇన్సూరెన్స్ ఉంది కదా.. అన్న ధైర్యంతో సమీపంలోని ఓ పెద్ద కార్పొరేట్ దవాఖానలో చేర్చాడు.

కానీ చికిత్స జరుగుతుండగా.. బీమా క్లెయిమ్ తిరస్కరణకు గురైంది. సరైన పత్రాలు లేవంటూ బీమా సంస్థ చెప్పింది. అన్ని పత్రాలను సమర్పించినా ఈ రకమైన సమాధానం రావడం ప్రదీప్‌ను ఎంతగానో నిరాశపర్చింది. ఏం చేయాలో తెలియక అయోమయంలోపడ్డ ప్రదీప్‌ను ఆసుపత్రి బిల్లులు ఇంకింత ఆందోళనలోకి నెట్టాయి. ఈ పరిస్థితి మనలో చాలామందికి ఎదురయ్యే ఉంటుంది. అందుకే ఇలాంటి కేసుల్లో ఐఆర్‌డీఏఐ కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది. మరి అవేంటో తెలుసా..

ప్రస్తుతం ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా ఎంత అవసరం? అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మారిన జీవన ప్రమాణాలు, పెరుగుతున్న కాలుష్యం, పుట్టుకొస్తున్న వైరస్‌లు.. అన్నీ కలిసి అనారోగ్య సమస్యల వలయంలోకి అందర్నీ నెట్టేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిజంగా హెల్త్ ఇన్సూరెన్స్ కొండంత ధైర్యమే. అందుకే అంతా ఆరోగ్య బీమాకు ఇంతలా ప్రాధాన్యాన్నిస్తున్నారు. అయితే పెరుగుతున్న క్లెయిముల్లో ఎక్కువగా తిరస్కరణకు గురవుతుండటం కనిపిస్తున్నది. వీటన్నింటినీ పరిశీలించిన బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ.. కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. అవి ఏం చెప్తున్నాయో తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

గత ఏడాది పాలసీదారుల ప్రయోజనాల రక్షణార్థం ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) తెచ్చిన మార్గదర్శకాలు.. డాక్యుమెంటేషన్ అవసరాలను చాలా సులభతరం చేసింది. దీంతో పాలసీదారులపై అనవసరపు పత్రాలను సమీకరించే భారం తగ్గిందని చెప్పవచ్చు. అయినప్పటికీ కావాల్సిన డాక్యుమెంట్లు లేవని బీమా సంస్థలు మీ ఆరోగ్య బీమా క్లెయిమ్‌ను తిరస్కరిస్తే.. ఏం చేయాలో ఐఆర్‌డీఏఐ తమ మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నది. క్లెయిమ్‌లో మీకున్న న్యాయపరమైన హక్కులనూ తెలియజేసింది. వాటిలో..

- కావాల్సిన డాక్యుమెంట్లు లేవని, లేదా క్లెయిమ్ ఆలస్యమైందన్న కారణంతో బీమా సంస్థ పాలసీదారుల అభ్యర్థనను తిరస్కరించరాదు.
- ఒకవేళ క్లెయిమ్‌ను తిరస్కరిస్తే బీమా కంపెనీలు అందుకుగాను లిఖితపూర్వక వివరణను పాలసీదారులకు ఇవ్వాలి.
- క్లెయిమ్ నిరాకరణకు బీమా సంస్థ చూపిన కారణాలు పాలసీ నిబంధనలకు లోబడే ఉన్నాయా? అని పాలసీదారులు తెలుసుకోవచ్చు. తద్వారా తప్పిదాలను సరిదిద్దుకోవచ్చు.
- నేరుగా క్లెయిమ్‌కు కావాల్సిన ప్రధాన డాక్యుమెంట్లను మాత్రమే బీమా సంస్థలు పాలసీదారుల నుంచి కోరవచ్చు. పాలసీని జారీ చేసేటప్పుడు ప్రామాణిక సూచనల్ని తప్పక చేయాలి.
- పాలసీదారులు మర్చిపోయిన పత్రాలను గుర్తుచేయడంలో బీమా కంపెనీలు సహాయం చేయాలి. ఆలస్యం లేకుండా క్లెయిమ్ పరిష్కారమయ్యేలా చూడాలి.
- అరకొర పత్రాలు, సమర్పించిన డాక్యుమెంట్లలో తప్పులున్నాయన్న కారణంగా బీమా సంస్థలు క్లెయిమ్‌ల ఆలస్యం, తిరస్కరించడం చేయరాదు.

సాధారణంగా క్లెయిమ్‌కు కావాల్సిన పత్రాలేవి?

- దవాఖాన బిల్లులు, రశీదులు
- డిశ్చార్జి సమ్మరీలు
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్
- ట్రీట్‌మెంట్ రికార్డులు
- ఎక్స్-రేలు, రక్త నమూనాలు, ఇతరత్రా పరీక్షల నివేదికలు
- క్లెయిమ్ ఫారం, పాలసీ కాపీ



గుర్తుంచుకోండి..

క్లెయిమ్ పరిష్కారంలో బీమా సంస్థ పనితీరు నిరాశాజనకంగా, అభ్యంతరకరంగా ఉంటే.. సదరు బీమా కంపెనీ ఫిర్యాదుల పరిష్కార విభాగానికి పాలసీదారులు ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదును అందుకున్న 15 రోజుల్లోగా బీమా సంస్థలు దాన్ని పరిష్కరించాల్సి ఉంటుంది. ఫిర్యాదు చేసినప్పుడు మీకు లభించే రశీదుతో అది ఏ దశలో ఉందన్నది కూడా పాలసీదారులు తెలుసుకోవచ్చు. తద్వారా మీ కంప్లైంట్‌ను ట్రాకింగ్ చేయవచ్చు. ఒకవేళ బీమా సంస్థ సమాధానం మిమ్మల్ని సంతృప్తిపర్చకపోతే.. ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా' వెబ్‌సైట్‌ను కూడా సంప్రదించవచ్చు. అయినప్పటికీ న్యాయం జరుగలేదని భావిస్తే.. ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించవచ్చు.

మార్కెట్ పల్స్

త్రైమాసిక ఫలితాలపై ఆధారం

దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. కొత్త ఏడాదిలో మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేస్తున్నారు. ఇటీవలి ఒడిదొడుకులు దీనికి రుజువు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,844.20 పాయింట్లు లేదా 2.32 శాతం క్షీణించి 77,378.91 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 573.25 పాయింట్లు లేదా 2.38 శాతం పతనమై 23,431.50 దగ్గర స్థిరపడింది. దీంతో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడిదొడుకులకు ఆస్కారముందని మెజారిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను ఆయా సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు మార్కెట్లను నడిపిస్తాయన్న అభిప్రాయాలూ ఉన్నాయి. ఇక డాలర్‌తో పోల్చితే అంతకంతకూ పడిపోతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ లాభాలను ఆవిరిచేస్తున్నది. దీంతో రూపీ పెరిగితే మార్కెట్లకు కలిసిరానున్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,100 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800-24,100 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No